దసరా సంబురం


మధిర: శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భట్టివిక్రమార్క దంపతులు


సత్తుపల్లిరూరల్: శమీ పూజ చేస్తున్న భక్తులు


కల్లూరులో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజల్లో పాల్గొన్న ఏసీపీ రఘు, సీఐ కిరణ్

దసరా పర్వదిన వేడుకలను శనివారం ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు పూజలకు హాజరయ్యారు. సాయంత్రం శమీ పూజ నిర్వహించి భక్తులు కోర్కెల చిట్టీలను జమ్మి కొమ్మలకు తగిలించారు. అనంతరం అమ్మవారికి కట్టించిన చీరలు, అమ్మవారికి నైవేద్యంగా ఉంచిన లడ్డూలను కమిటీ నిర్వాహకులు వేలం పాట నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. కొబ్బరి, అరటి ఆకులతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై అమ్మవారిని ఉంచి డప్పులు, వాయిద్యాలతో బాణసంచాలను పేలుస్తూ నృత్యాలు చేస్తూ గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల సమీపంలో ఉన్నటువంటి మున్నేరు, చెరువుల్లో అమ్మవారి నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


చింతకాని: మత్కేపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామిని ఊరేగిస్తున్న భక్తులు


కారేపల్లి: నృత్యం చేస్తున్న మహిళలు


ముదిగొండ: పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న సీఐ మురళి


కొణిజర్ల: తనికెళ్లలో అమ్మవారి విగ్రహాన్ని శోభాయాత్రకు సిద్ధం చేస్తున్న దృశ్యం


చింతకాని: మత్కేపల్లి గ్రామంలో..


ఏన్కూరులో..


బోనకల్: అమ్మవారి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

ఇళ్లల్లో ఉండాలంటే భయమేస్తోంది..

- మరమ్మతులు సరిగ్గా చేయటం లేదు..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఫిర్యాదు


సత్తుపల్లి: అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు డాక్టర్ రాగమయి, రాందాస్‌నాయక్

సత్తుపల్లి: 'సింగరేణి బాంబుబ్లాస్టింగ్‌కు ఇళ్లన్నీ పగుళ్లు వచ్చాయి.. వర్షం వస్తే నీళ్లన్నీ ఇంట్లోనే ఉంటున్నాయి.. ఎప్పుడు కూలిపోతాయో అర్థంకావటం లేదు.. ఇళ్లల్లో ఉండాలంటే భయమేస్తోంది.' సత్తుపల్లి పట్టణ వెంగళరావునగర్ కాలనీ వాసులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో వాపోయారు. శనివారం సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఎస్‌కె ఖాసీంబీ, బత్తుల లక్ష్మి, కుర్నెల్లి రవికుమార్ ఇళ్లను ఎమ్మెల్యే మట్టా రాగమయి, సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఇళ్ల మరమ్మతులు సరిగా చేయటం లేదంటూ బాధితులు దృష్టికి తేవటంతో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితిలో రాజీపడొద్దని, పారదర్శకంగా ఓపెన్ టెండర్లు పిలిచి మరమ్మతుల చేయించాలని, కాంట్రాక్టర్ తప్పు చేస్తే అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేయాలని సింగరేణి సీఎండీని భట్టి విక్రమార్క ఆదేశించారు. కాంట్రాక్టర్ ఫోన్ నంబర్లను సంబంధిత పని ప్రదేశాలలో డిస్‌ప్లే చేయాలని సూచించారు. మరమ్మతులకు అవసరమైన ఇళ్లను గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేసి పారదర్శకంగా బాధితుల జాబితాను తయారు చేసి పనులు చేపట్టాలన్నారు. వాటర్‌ప్యూరిఫైడ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే కాంట్రాక్టర్లతో వాటి నిర్వాహణకు సంబంధించి విధిగా అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ నిధులతో నిర్వాహణకు ఔట్‌సోర్సింగ్ ద్వారా కార్మికులను నియమించుకొని మంచినీటి సరఫరా సక్రమంగా జరిగాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనులు చేపడతానన్నారు. అదే విధంగా సత్తుపల్లి మండలం జగన్నాథపురం ఆర్ అండ్‌ఆర్ సెంటర్‌లో ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం, ఓవర్‌హెడ్‌ట్యాంక్, సైడ్‌డ్రైయిన్లు, చర్చి, దేవాలయం, హైలెవల్ బ్రిడ్జి, ఆర్‌ఓఆర్ ప్లాంట్, సీసీ రోడ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డాక్టర్ మట్టా దయానంద్, దోమా ఆనంద్‌బాబు, తోట సుజలరాణి, దూదిపాల రాంబాబు, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, పింగళి సామేలు, పద్మజ్యోతిరెడ్డి, ఎస్‌కె నాగుల్‌మీరా పాల్గొన్నారు.

'పండగ అల్లుడు' పుస్తకాన్ని ఆవిష్కరించిన భట్టి..

మధిర: మధిర సాంస్కృతిక సారథి, నటుడు, రచయిత మధిర బాబ్లా రచించిన బాల సాహిత్యం నాటికల ఐదో పుస్తకం ×పండగ అల్లుడు₹ పుస్తకాన్ని భట్టివిక్రమార్క శనివారం ఆవిష్కరించారు. ఇంతకుముందు బాబ్లా రచించిన ఐదు పుస్తకాలు విడుదల అయ్యాయి. ఇప్పటివరకు ముద్రిత నాటికలు 70, ముద్రణ కానివి 20 ఉన్నాయని తెలిపారు. గత నెలలో గుంటూరు సంస్కృతి సంస్థ వారు నిర్వహించిన నాటికల, రచనల పోటీలో మధిర బాబ్లా రచించిన తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త అనే నాటికకు రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో పుతుంబాక కృష్ణప్రసాద్, బాణావత్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైరాలో భట్టి పర్యటన..

వైరా: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం సత్తుపల్లి వెళ్తూ వైరాలో కాంగ్రెస్ పార్టీ నాయకులను స్థానిక క్రాస్ రోడ్డులో చూసి తన కాన్వాయ్‌ను ఆపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు భట్టికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శకుంస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో గల శ్రీప్రసన్నాజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఏడు సెంట్ల స్థలాన్ని నరుకుళ్ల వెంకయ్య, నర్సమ్మ, నరుకుళ్ల రామయ్య, చిట్టెమ్మలు అందించినట్లు వారసులు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో యుగంధర్, మున్సిపల్ చైర్మన్ మహేష్, సాంబశివరావు, సత్యనారాయణ, నర్సింహారావు, కృష్ణారెడ్డి, ప్రసాద్ సురేష్ పాల్గొన్నారు.

నేత్రదాన ప్రశంసా పత్రం అందజేత

మధిర: మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన వేములపల్లి భూలక్ష్మీదేవి నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానం చేయటంతో ఆమె కుటుంబ సభ్యులకు గ్రామ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం నేత్రదాన ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. మున్సిపల్ లైసెన్స్ ప్లానర్ వేములపల్లి అప్పారావు, మాటూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ మాతృమూర్తి ఈ నెల 3న మరణించగా ఆమె నేత్రాలను నేత్రనిధికి దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నేత్రనిధి బాధ్యులు మాదవరపు నాగేశ్వరరావు, ఉచిత హోమియో వైద్యశాల స్వయం సేవకులు సావిత్రి, ఉపాధ్యాయులు రామకృష్ణ, గోపాలకృష్ణమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో 'ఆర్‌ఎస్‌ఎస్ పద సంచలన్'

సత్తుపల్లిరూరల్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు ఆదివారం సాయంత్రం పద సంచలన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర సంచాలక్ కోరుకొండ వెంకటేశ్వరరావు, డి.రాజేష్, కె.రమేష్, సోమరాజు శివరాంప్రసాద్, కొండపల్లి విజయ్‌కుమార్, బోనగిరి కృష్ణ, దాశరధి దేవరపల్లి శ్రీనివాస్, ప్రసాద్, నాయుడు రాఘవరావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

15 నుంచి గాలికుంటు వ్యాక్సినేషన్

కారేపల్లి: మండలంలో 15నుంచి సుమారు రెండు నెలల పాటు మండలంలో పశువులకు గాలికుంటు వ్యాక్సినేషన్ వేయనున్నట్లు పశువైద్యాధికారి ఉపేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు కారేపల్లిక్రాస్‌రోడ్డులో ప్రారంభం కాగా.. వైద్యులు 5 బృందాలుగా ఏర్పడి టీకా వేయనున్నారని, దీనికి సంబంధించిన షెడ్యూల్ ఆయా గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోట మైసమ్మకు బోనాల జాతర

– 11వ వార్షికోత్సవ వేడుకలు..


కోట మైసమ్మకు బోనం సమర్పించేందుకు ఆలయం వద్ద పోటెత్తిన భక్తులు

తల్లాడ: తల్లాడలో ఆదివారం కోట మైసమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. కోటమైసమ్మ ఆలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కంచెల సతీష్ శర్మ అభిషేక పూజలు చేసి అమ్మవారిని అలంకరించారు. బోణాల జాతర సందర్భంగా తల్లాడలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోణం సమర్పించాలనీ ఆలయ కమిటీ విజ్ఞప్తి చేయగా భారీ సంఖ్యలో మహిళలు బోణం సమర్పించారు. చీర సారెలు పెట్టి అమ్మవారిని పూజించుకున్నారు. పసుపు, కుంకుమతో అమ్మవారిని పూజించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా శ్రీకనకదురాదేవి ఆలయ 39వ వార్షికోత్సవ వేడుకలు


శ్రీదుర్గాపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులో గల శ్రీకనకదుర్గాదేవి 39వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం శ్రీకనకదుర్గాదేవికి ఆలయ కమిటీ నిర్వాహకులు యార్లగడ్డ దయానంద్, సత్యవతిల ఆధ్వర్యంలో భవానిమాలధారణ భక్తులు ఛండీహోమం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం ఉదయం 12 గంటలకు శ్రీదుర్గా పరమేశ్వరుల కల్యాణ నిర్వహించారు. భవానిమాలధారణ భక్తులు శనివారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించి విజయవాడ కనకదుర్గాదేవి ఆలయానికి తరలివెళ్లారు.

19న ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ఎంపిక

కల్లూరు: ఈ నెల 19వ తేదీన కల్లూరు మినీ స్టేడియం ఆవరణలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం చదువుతన్న బాలికలకు 01/01/2008 తరువాత జన్మించి ఉన్న వారిని ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలికల జట్టుకు ఎంపిక చేయనున్నట్లు డీవైఈఓ రవిబాబు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపికల నిర్వాహణ కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్యలు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ గుర్తింపు ఉన్న జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే కళాశాలలో చదువుతున్న బాలికల ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికలో పాల్గొనే బాలికలు ఎస్‌ఎస్‌సీ మోమో, కళాశాల ప్రిన్సిపల్ అటెస్టెడ్ చేసిన బోనిఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తీసుకొని రావాలని కోరారు. ప్రతి కళాశాల నుంచి ఇద్దరూ లేక ముగ్గురు బాలికలు మాత్రమే అనుమతించబడనున్నట్లు పేర్కొన్నారు.

మిషన్ భగీరథ కల్లూరు సబ్‌డివిజన్ కమిటీ ఎన్నిక


హస్తరా లక్ష్మణ్


ఉబ్బన వేణుబాబు

కల్లూరు: మిషన్ భగీరథ కార్మికుల యూనియన్ ఎన్నికలు కల్లూరు సబ్‌డివిజన్ అధ్యక్షుడిగా హస్తరా లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉబ్బన వేణుబాబు ఎన్నికయ్యారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల రవి అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకులు ఎస్‌కే యాకూబ్ అలీ, ఓర్సు రవి, బత్తుల కిషోర్, కార్మికులు హాజరయ్యారు.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

కల్లూరు: కల్లూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఖమ్మంలో నివాసముంటున్న సీపీఎం నాయకుడు దామాల ప్రేమ్ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం కల్లూరులో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రేమ్ కుమార్తె హవిల అంత్యక్రియలు నిర్వహించింది. కాగా ప్రేమ్ మృతదేహం వద్ద సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సభ్యత్వ నమోదు ముమ్మరంగా నిర్వహించాలి

బోనకల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు సూచించారు. ఆదివాకం మండలంలోని రావినూతల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ఈ నెల 15నాటికి పూర్తిచేయాలన్నారు. అదేవిదంగా గడపగడపకు వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. బోనకల్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కోసం కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, సురేష్, రవికుమార్, పరుశురాం, గోపాల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్

చింతకాని: సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద సీఐటీయూ జెండాను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. పందిళ్లపల్లి రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తుండగా ఈ యార్డులో హమాలీలుగా పనిచేసేందుకు స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం మిరియాల నర్సింహారావు ఆధ్వర్యంలో కార్మికులందరూ హమాలీ సంఘంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు భ్యూక్యా శ్రీనివాస్, జిల్లా నాయకులు మడుపల్లి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కన్నెబోయిన కొండలు, ఉపేందర్ అను ఇద్దరి వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 25వ తేదీన గ్రామానికి చెందిన కన్నెబోయిన అంజయ్య పందిళ్లపల్లిలో కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాడు. కోళ్ల ఫారం వద్దకు వెళ్లిన కన్నెబోయిన కొండలు, ఉపేందర్ ఇరువురు అంజయ్యపై గొడవపడి అసభ్య పదజాలంతో దూషించి చంపుతామని బెదిరించారు. దీంతో అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పురుగుమందు తాగిన వ్యక్తి మృతి

బోనకల్ :మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు సైదులు(40) వారం రోజుల క్రితం పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఏడాది అతని భార్య కూడా పురుగుమందు తాగి మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనతో బాధపడుతూ ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

సన్మానం..

ముదిగొండ: మండలంలోని వనంవారికిష్టాపురంలో డీఎస్సీలో ఉద్యోగం సాధించిన పణితి జయంతి, వాడపల్లి శ్రీనులను ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి వారిని శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మట్టపల్లిరావు, వెంకట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీచర్ కొలువు సాధించిన వరలక్ష్మికి..

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కోట వరలక్ష్మి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి టీచర్ ఉద్యోగం సాధించింది. ఆదివారం టీచర్ కొలువు పొందిన వరలక్ష్మికి నవతరం సంఘం కోట లోకేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మేకల రమేష్‌లతో పాటు పలువురు సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నగేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సునీల్ మాదిగ, టీజీబీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సండ్ర కుమారుడికి సీఎం ఆశీర్వాదం


సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కుమారుడు భార్గవ్ సాయి - చిద్విలత వివాహం హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరగగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

– సత్తుపల్లి

కార్యకర్తలు అధైర్యపడొద్దు..


వైరా: తేనేటి విందులో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా: కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు తాను తోడుంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ రాజశేఖర్ ఇంటో తేనేటి విందుకు హాజరై పార్టీ శ్రేణులతో చర్చించారు. అనంతరం పలువురుని పరామర్శించారు. త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని తప్పకుండా వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పదవుల భర్తీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ఆయన వెంట నీటిపారుదల కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, దార్నా రాజశేఖర్, కట్ల రంగారావు, ఇటుకల మురళి, నంబూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ట్రేడర్స్‌ను ప్రారంభించిన..

కల్లూరు: కల్లూరు పట్టణంలో సోమలింగారెడ్డి ఆస్పత్రి వీధిలో చిమిరాల సురేష్‌కు చెందిన కనకదుర్గా ట్రేడర్స్‌ను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీను, ప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

బీమాచెక్కు అందజేత


కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: పీఆర్‌టీయూ క్రియాశీలక సభ్యుడు, అచ్యుతాపురం స్కూల్ అసిస్టెంట్ బుచ్చయ్య ఇటీవల మరణించటంతో క్రియాశీలక సభ్యత్వ బీమా సొమ్ము రూ.లక్ష చెక్కును సత్తుపల్లిలో ఆదివారం పీఆర్‌టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ప్రసాద్, పీఎస్‌ఎస్ ప్రసాద్, పీడీ శ్రీనివాసరెడ్డి, ఏవి, సీహెచ్ అప్పారావు, నాగాచారి, రామకృష్ణ, శ్రీనివాసరావు, జి.రవి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: కారేపల్లి గ్రామానికి చెందిన కొప్పెర ధనమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికావటం, ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో.. మందుల ఖర్చుల నిమిత్తం బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ నాయకులు, జామే మసీదు మాజీ అధ్యక్షుడు షేక్ గౌసుద్దీన్ ఆమెకు ఆర్థిక సాయంతో పాటు.. నిత్యావసర సరుకులను ఆదివారం అందించారు. కార్యక్రమంలో సింగరేణి గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు సత్యనారాయణ, ఖలీలుల్లాఖాన్, అబ్దుల్ ఆయత్, రాము, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1957–62 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అపూర్వ కలయిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. వీరిలో స్నేహ గోపాలరావు(సత్తుపల్లి మేజిస్ట్రేట్), గుమ్మడిదల సుబ్బారావు(బెటాలియన్ రిటైర్డ్ ఎస్పీ), ప్రముఖ న్యాయవాది జానకి రామారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త కర్నాటి వెంకటరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ రీజనల్ కోఆర్డినేటర్ మేకల పుల్లయ్యతో పాటు అనేక మంది ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, వివిధ వృత్తుల్లో కొనసాగుతున్న వారందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివించేదుకు గాను ఆర్థిక సాయం చేయాలని, ఆటస్థలం కొనుగోలు చేయానలి తీర్మాణించుకున్నారు.

భీమవరం గ్రామంలో..


భీమవరంలో పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలోని వేమిరెడ్డిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012 సంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. గురువలను సత్కరించి, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సాంబయ్య, రామారావు, పీడీ జమలయ్య తదితరులున్నారు.

ఏన్కూరు పాఠశాలలో..


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అలనాటి ఉపాధ్యాయులను సన్మానించి.. తమతో పాటు చదువుకుని ఆదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పూర్వ మిత్రులు కమల, సులోచనలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కిషోర్, నరేష్, హరీష్, సురేష్, కృష్ణయ్య, నవీన్, రమాదేవి, గౌసియా, రజిని, సులోచన, కమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.